సాక్షి సంగారెడ్డి

గురువారం । 25 । మే । 2023

డయల్ యువర్ డిపో మేనేజర్

సంగారెడ్డి టౌన్ : డయల్ యువర్ డీఎం కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని టీఎస్ ఆర్టీసీ సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. జిల్లాలోని ప్రయాణికులు సలహాలు, సూచనలు ఉంటే 8500376267 నంబరుకు కాల్ చేయాలన్నారు.



ఆశ చూపి..ఎర వేసి

సైబర్ నేరగాళ్లు రోజుకో తీరుగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. కార్డులు అప్‌డేట్ చేసుకోవాలని.. రెట్టింపు లాభాలు వస్తాయని ఆశచూపి ఎరవేస్తూనే ఉన్నారు.

8లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఏడుగురికి కోవిడ్ టెస్టులు చేయగా, అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్ట్‌ల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 12 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని మంత్రి గంగుల కమలాకర్ కలెక్టర్లకు సూచించారు. బుధవారం ఆయన కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని, 13,730 మంది రైతుల నుంచి 67,230 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని మంత్రికి వివరించారు. ఇప్పటివరకు రూ.43.82 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్ఓ వనజాత, డీఎం సుగుణభాయి, తదితరులు పాల్గొన్నారు.

లాకౌట్ ఎత్తివేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న రాజయ్య

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం హార్టెక్స్ పరిశ్రమ విధించిన లాకౌట్ ఎత్తి వేయాలని, వేతన ఒప్పందం చేయడంతో పాటు, సస్పెన్షన్లు వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కార్మికుల ధర్నా శిబిరానికి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్టెక్స్ పరిశ్రమ కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందన్నారు. కార్మికులకు 8 సంవత్సరాల నుంచి అగ్రిమెంట్ చేయకపోవడం ఎంతవరకు సమంజమన్నారు. 25 సంవత్సరాల నుంచి పరిశ్రమ నడుపుతున్నా కార్మికులకు రూ.20 వేల జీతం కూడ లేదన్నారు. సమస్యల గురించి ప్రశ్నించే కార్మికులను సస్పెండ్ చేయడం దుర్మార్గం అన్నారు. లాకౌట్ చట్టవిరుద్ధమని, దీనికి ప్రభుత్వ అనుమతులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నర్సింలు, టీఆర్ఎస్‌కేవి నాయకుడు వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



మామిడ్గిలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఊరుబాట పట్టారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం కళాశాల అధ్యాపకులు అర్జున్, యాదగిరి, రాములు మామిడ్గి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యతోపాటు అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని, విద్యార్థులను తమ కళాశాలలో చేర్పించాలని వారు కోరారు. తమ పిల్లలను చేర్పిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పగా, అధ్యాపకులు ఆ వివరాలు నమోదు చేసుకున్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన



జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నారాయణఖేడ్: మన ఊరు– మనబడి ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. డీఈఓ బుధవారం నారాయణఖేడ్‌ను సందర్శించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మార్వాడీగల్లి, నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి జరుగుతున్న పనులు, గదులు, ఆవరణను పరిశీలించారు. అనంతరం ఖేడ్, సిర్గాపూర్ ఎంఈఓలు విశ్వనాథ్, శంకర్‌లతో సమావేశమయ్యారు.

నకిలీలలెన్నో..!

రైతులు ఫిర్యాదు చేసినా.. నెలల తరబడి పట్టించుకోని వైనం

- కలెక్టర్ ఆదేశించిన తర్వాతే వ్యవసాయాధికారుల దాడులు
- నకిలీలు టన్నుల్లో.. పట్టుకున్నవి ప్యాకెట్లలో..



జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నకిలీ విత్తనాలు..పురుగుమందులు..ఎరువులు విక్రయిస్తూ రైతులను నిండా ముంచుతున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు ఏర్పాటు చేసిన వ్యవసాయశాఖ టాస్క్‌ఫోర్స్ బృందాలు నకిలీలతో అంటకాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. నిత్యం ఆకస్మిక దాడులు నిర్వహించాల్సిన ఈ బృందాల్లోని కొందరు అధికారులు వారితో చేతులు కలిపారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

- ఇటీవల సదాశివపేట మండలం ఆత్మకూర్‌లోని ఉదయ్‌కుమార్‌జైన్ వద్ద పట్టుబడిన రూ.2.82 కోట్లు విలువ చేసే నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు, నకిలీ ఎరువుల వ్యవహారమే ఇందుకు నిదర్శనంగా ఉదాహరిస్తున్నారు. ఇక్కడ కొన్నేళ్లుగా నకిలీ దందా జరుగుతోంది.
- జిల్లావ్యాప్తంగా ఇలాంటి నకిలీదందాపై నిఘా పెట్టి దాడులు నిర్వహించాల్సిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉదయ్‌కుమార్‌జైన్ జోలికి వెళ్లకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పైగా రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదనే ఆరోపణలు ఉన్నాయి.
- ఈ ప్రాంతంలోని పలువురు రైతులు నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయారు. అయినా టాస్క్‌ఫోర్స్ బృందాలు కనీసం పట్టించుకోలేదు. ఈ అక్రమ దందాపై బాధిత రైతుల నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ ఆదేశిస్తే గానీ వ్యవసాయశాఖ అధికారుల్లో కదలిక రాలేదు.

తనిఖీలు అంతంతే...

నకిలీ విత్తనాలు..పురుగుమందులు.ఎరువుల దందా టన్నుల్లో సాగుతుంటే... టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టుకుంటున్నవి ప్యాకెట్లలో మాత్రమే. ఈ లెక్కన ఈ బృందాల పనితీరు ఎంత మొక్కుబడిగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. రెండేళ్లుగా ఈ బృందాలు పట్టుకున్న విత్తనాలు పరిశీలిస్తే..

- 2021–22 లో అందోల్, వట్‌పల్లి, జహీరాబాద్ మండలాల పరిధిలో ఐదు కేసులు నమోదు చేసి. 756 ప్యాకెట్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు.
- 2022–23లో నాలుగు కేసులు చేసి, నకిలీ పత్తి, సోయాబీన్ విత్తనాలు సీజ్ చేశారు.

శాఖాపరమైన చర్యలేవీ?

నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల తయారీకి పరోక్షంగా సహకరిస్తున్న వ్యవసాయశాఖలో కీలక అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఆత్మకూర్ నకిలీల విషయంలో రైతులు తొమ్మిది నెలలుగా ఫిర్యాదులు చేస్తున్నా స్థానిక వ్యవసాయశాఖ అధికారులుగానీ టాస్క్‌ఫోర్స్ బృందాలు గానీ ఎందుకు దాడులు చేయలేదనే వ్యవహారంపై శాఖాపరమైన విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నకిలీలు, ఆరోపణలు, టాస్క్‌ఫోర్స్ పనితీరుపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింగ్‌రావును 'సాక్షి' కార్యాలయంలో సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు. ఫోన్‌లో సంప్రదించినా ఆయన స్పందించలేదు.

ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

- రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలపై కలెక్టర్ సమావేశం

సంగారెడ్డిటౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు ఆయా అధికారులు వివిధ కార్యక్రమాలను ప్రణాళికతో చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్‌ను అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలపాలి



క్రీడాకారులతో కలెక్టర్ శరత్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ తదితరులు

- ముగిసిన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

సంగారెడ్డి టౌన్: సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్రీడలతో క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వచ్చిందన్నారు. అందరి సమన్వయం, సహకారాలతో మండల, జిల్లాస్థాయి క్రీడలు నిర్వహించుకున్నామన్నారు. ఆత్మ విశ్వాసం, క్రీడాస్ఫూర్తి, పట్టుదలతో ఆడిన క్రీడాకారులందరినీ ఆమె అభినందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, అన్నింటిని స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. ఓటమితో నిరుత్సాహపడకుండా గెలిచిన వారినుంచి మెళుకువలు నేర్చుకుని, వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో వివిధ క్రీడల్లో గెలుపొంది ఫస్ట్, సెకండ్ ప్లేస్‌లో నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, కప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్వో నగేష్, జిల్లా యువజన క్రీడల అధికారి రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: వివిధ రంగాల్లో విశిష్టసేవలు అందించిన వారికి భారత ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రదానం చేస్తుందని, ఆయా రంగాల్లో సేవలు అందించిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రాంచందర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పద్మ అవార్డులకు ఎంపికైన వారికి వచ్చే జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందజేస్తారన్నారు. కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ ఇతర రంగాల్లో సాధించిన లక్ష్యాలను, చేసిన కృషిని 800 పదాలు మించకుండా ఈనెల 28తేదీలోగా సంగారెడ్డి జిల్లాకు చెందిన వారు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి కార్యాలయం, రెండవ అంతస్తు కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో 3 సెట్స్ దరఖాస్తులతో పాటు సంబంధిత పేపర్ కటింగ్‌లు, ఫొటోలు జతచేసి అందజేయాలన్నారు.

మామిడిపై క్షేత్ర సందర్శనకు రైతులు



క్షేత్ర సందర్శనకు బయలుదేరి వెళుతున్న రైతులు

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు క్షేత్ర సందర్శన నిమిత్తం మహారాష్ట్ర తరలివెళ్లారు. బుధవారం ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నాబార్డు వారి సహకారంతో స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాసిక్ జిల్లా పరిధిలోని సహయాద్రి ప్రాంతానికి వెళ్లారు. మామిడి కోతల అనంతరం చేపట్టాల్సిన వివిధ యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్, ప్రాసెసింగ్ పద్ధతులపై అవగాహన పెంచుకునేందుకు వెళ్లారు. యాత్రను నాబార్డు డీడీఎం తిమోతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, స్కోప్ సంస్థ మేనేజర్ రాజుతో పాటు గోపాల్, రాంశెట్టి, అశోక్, మల్లేశం, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అధిక దిగుబడితోనే లాభాలు



బెల్లాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న సరితారెడ్డి

మనూరు(నారాయణఖేడ్): చెరకులో అధిక దిగుబడి సాధిస్తేనే రైతులకు లాభాలు వస్తాయని మాగి, గాయత్రి చక్కెర కార్మాగారం మేనేజింగ్ డైరెక్టర్ సరితారెడ్డి అన్నారు. బుధవారం మండలం పరిధిలోని బెల్లాపూర్‌లో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చెరకు సాగు, బిల్లుల అందే విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు వివరించారు. సాగుచేస్తున్న సమయంలో సమయానికి ఎరువులు అందించాలన్నారు. చెరకు చేతికొచ్చే సమయంలో తాము పర్మిట్‌ల కోసం పడుతున్న ఇబ్బందులను వివరించారు. రైతులకు టన్నుకు కిలో చొప్పున చక్కెర, ఈ ఏడాది ధర పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. దీనిపై సరితారెడ్డి స్పందిస్తూ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చుతామని, పర్మిట్‌ల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో గాయత్రి చక్కెర కర్మాగారం అధ్యక్షుడు శంకర్‌రావు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, జనరల్ మేనేజర్ వెంగళ్‌రెడ్డి, ఏజీఏ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు న్యాయసేవలు పొందవచ్చు



జైలులోని వంటశాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: ఖైదీలు న్యాయసేవలు పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు తెలిపారు. బుధవారం కందిలోని జిల్లా జైలులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందజేస్తున్న భోజనం, వారికి కావాల్సిన సదుపాయాలు, ఇతర వస్తువులు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వంటశాలను తనిఖీ చేశారు. ఖైదీలకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరిటెండెంట్ భరత్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ తెలిపారు. పట్టణ శివారులోని సంపును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్‌లోని ఫిల్టర్ బెడ్ నుంచి రోజూ 15 లక్షల లీటర్ల నీరు ఖేడ్ సంపునకు వస్తుందన్నారు. సంపు నుంచి మున్సిపాలిటీ పరిధిలోని 12 ట్యాంకులకు నీటిని పంపి అక్కడి నుంచి నల్లాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్నామన్నారు. సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు.

కాలుష్య జలాల పారబోత



కాలుష్య జలాలను పారబోత ఇలా..

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున కాలుష్య జలాలను పారబోశారు. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానిక నాయకులు పీసీబీ అధికారులకు సమాచారం అందించగా, ఘటనాస్థలానికి చేరుకొని కాలుష్య జలాలకు సంబంధించిన నమూనాలను సేకరించారు. కాలుష్య జలాలను పారబోసిన వ్యక్తులను గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన



పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్–మంగాపూర్ కాలనీలో శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్ర స్థాపన, విగ్రహాలకు పాణప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, మహాబలిహరణ, స్వామివారికి విశేష పూజ, హారతి నిర్వహించి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట అత్మ చైర్మన్ పెంటారెడ్డి, బర్దిపూర్ బావిపీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నేటి నుంచి లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



కొండాపూర్(సంగారెడ్డి): మండలపరిధిలోని మారేపల్లి గల లక్ష్మీనారాయణ స్వామి షష్టమ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది.

- గురువారం ఉదయం 9 గంటలకు సంగారెడ్డిలోని వైకుంఠపురం ఆలయం నుంచి మారేపల్లిలోని లక్ష్మీనారాయణ ఆలయం వరకు రథంపై ఉత్సవ మూర్తుల శోభాయాత్ర ఉంటుంది.
- ఈ నెల 26వ తేదీన ఉదయం 7 గంటల నుంచి పంచామృత సహిత కలశాలతో గ్రామోత్సవంగా ఊరేగింపు, లక్ష్మీనారాయణస్వామికి అభిషేకం జరిపిస్తారు.
- 27వ తేదీన ఉదయం 8:30 నిమిషాలకు యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, ద్వారా తోరణ ధ్వజకుంభ ఆరాధన, ధ్వజారోహణం, ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష్మీనారాయణస్వామి హోమం, తల్లిదండ్రులకు పాదపూజ, సాయంత్రం 6 గంటల నుంచి ఎదుర్కోళ్లు, నివేదన, మంగళశాసనం, తీర్థగోష్టి ఉంటుంది.
- 28వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రీ లక్ష్మీనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవం, పల్లకీసేవ, సాయంత్రం 5 గంటల నుంచి రథోత్సవం ఉంటుంది.
- 29వ తేదీన ఉదయం 8:30 నిమిషాల నుంచి సుదర్శన మూలమంత్ర హవనము, చక్రస్నానం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు ఉచితంగా అన్నదాన కార్యక్రమాలు ఉంటాయి.

ఆ ముగ్గురూ పూర్వ విద్యార్థులే..

సివిల్స్‌లో మెరిసిన అభ్యర్థులకు ఐఐటీహెచ్ అభినందనలు



ఎస్. ఉమాహారతి



రావుల జయసింహారెడ్డి



బొల్లం ఉమామహేశ్వర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఉత్తమర్యాంకులు సాధించిన వారిలో ముగ్గురు హైదరాబాద్ ఐఐటీ పూర్వ విద్యార్థులే ఉన్నారు. సివిల్స్‌లో ఆలిండియా మూడో ర్యాంకు సాధించిన ఎస్.ఉమాహారతి, 217వ ర్యాంకు సాధించిన రావుల జయసింహారెడ్డి, 270 ర్యాంకు సాధించిన బొల్లం ఉమామహేశ్వర్‌రెడ్డిలు హైదరాబాద్ ఐఐటీ పూర్వ విద్యార్థులు కావడం గమనార్హం. ఉమాహారతి 2017 బీటెక్ సివిల్ ఇంజినీరింగ్, జయసింహారెడ్డి 2019లో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఉమామహేశ్వర్‌రెడ్డి 2016లో మెకానికల్ ఎరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఐఐటీ హెచ్ డైరెక్టర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ ముగ్గురు పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు ఐఐటీ హెచ్ విద్యార్థులతో పాటు, యువతకు ప్రేరణ అవుతుందన్నారు. నిబద్ధతతో కృషి చేసినప్పుడు గమ్యాన్ని సులభంగా చేరుకోవచ్చని వీరు నిరూపించారన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు డాక్టర్ ముద్రికా ఖండేల్వాల్, సూర్యప్రకాష్, ఉమాశంకర్, ఎం.రాంజిలు ఉన్నారు.

క్లుప్తంగా

డీసీఎం డ్రైవర్ రిమాండ్

పటాన్‌చెరు టౌన్: నలుగురు మృతికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను రిమాండ్ కు తరలించారు. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం మండల పరిధిలోని చిట్కుల్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ రాజేందర్ ఈనెల 11 వతేదీన అదే గ్రామానికి చెందిన నాగరాణి పెళ్లి జరగా, మరునాడు వికారాబాద్ జిల్లా మొయినాబాద్ మండలం చిన్నమంగళారం గ్రామానికి చెందిన పెళ్లికొడుకు నాగభూషణం ఇంటి వద్ద రిసెప్షన్ వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో రుద్రారం శివారులో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టాడు. సంఘటన స్థలం వద్ద ఇద్దరు, చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు డ్రైవర్ రాజేందర్ మద్యం తాగి డ్రైవింగ్ చేసినట్టు తెలియగా, అతన్ని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గడ్డివాము దగ్ధం

అక్కన్నపేట(హుస్నాబాద్): నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైంది. మండలపరిధిలోని చౌటపల్లి గ్రామానికి చెందిన చల్లగొండ సంపత్ రావు వ్యవసాయ పొలంలో రెండు విద్యుత్ తీగలు తాకి ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుంకొని బూడిద అయ్యింది. సమాచారం తెలుసుకున్న ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పింది. ఈ ఘటనలో ఎలాంటి పెద్ద ప్రమాదం జరగక పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భిక్షాటన చేస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని రాక్‌గార్డెన్ వద్ద కొంతకాలంగా 45ఏళ్ల వ్యక్తి భిక్షాటన చేస్తున్నాడు. అనారోగ్యంతో బాధ పడుతూ బుధవారం రాక్‌గార్డెన్ వద్ద మృతి చెందాడు. టౌన్‌షిప్ హోంగార్డుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..



శ్రీనివాస్ (ఫైల్)

కంది(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఇంద్రకరణ్ ఎస్ఐ రాజేష్‌నాయక్ కథనం ప్రకారం కంది మండల పరిధిలోని కలివేముల గ్రామానికి చెందిన రైతు బక్కి శ్రీనివాస్ (35) మంగళవారం రాత్రి వరికోత యంత్రం ద్వారా తన పొలంలో పనులు చేపట్టారు. ఈ క్రమంలో యంత్రానికి వదులుగా ఉన్న విద్యుత్ తీగలు తగులుతుండగా వాటిని కర్ర సాయంతో తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు శ్రీనివాస్‌కు విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆశ చూపి.. ఎర వేసి

సైబర్ మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లు

సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు తీరుగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. కార్డులు అప్‌డేట్ చేసుకోవాలనో, రెట్టింపు లాభాలు వస్తాయనో, రకరకాలుగా ఆశచూపి ఎరవేస్తూనే ఉన్నారు.

బ్యాంకు అధికారులమని...

మీ క్రెడిట్ కార్డు వివరాలు చెప్పండి..బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ గుర్తు తెలియని వ్యక్తి బురిడీ కొట్టించిన ఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. సిద్దిపేట పోలీస్‌కమిషనర్ ఎన్.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తికి ఎస్‌బీఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని మీ క్రెడిట్ కార్డు గడువు ముగిసింది.. రెన్యూవల్ చేయడానికి వివరాలు తెలపాలని గుర్తు తెలియని వ్యక్తి మాటలు కలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన క్రెడిట్ కార్డు వివరాలతో పాటు తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలపడంతో బాధితుడి ఖాతా నుంచి



రూ.8,900 డెబిట్ అయినట్టు మెసెజ్ వచ్చింది. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

రెట్టింపు లాభం పేరుతో మోసం

హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు ఇన్‌స్టాగామ్‌లో రూ.5వేలు పెట్టుబడిగా పెడితే రూ.30వేలు లాభం వస్తాయని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన బాధితుడు అందులో ఉన్న ఫోన్‌నంబరుకు ఫోన్ పే ద్వారా రూ.5వేలు పంపించాడు. తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా సైబర్ నేరగాడు మరిన్ని డబ్బులు పంపాలని కోరాడు. దీంతో సైబర్ మోసం జరిగినట్టు గుర్తించిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేయగా, పోలీసులు రూ.5వేలు ఫ్రీజ్ చేశారు.

పాన్‌కార్డు అప్‌డేట్ పేరుతో మోసం

కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక వ్యక్తికి మీ పాన్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని, లేదంటే మీ బ్యాంకు ఖాతా బ్లాక్ అవుతుందని గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ పంపించాడు. అది నమ్మిన బాధితుడు తనకు వచ్చిన లింకును ఓపెన్ చేసి అందులో తన వివరాలు నమోదు చేసి, పాన్ కార్డు వివరాలు, తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు చెప్పగా, బాధితుడి ఖాతా నుంచి రూ.92,220 డబ్బులు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

నిలిపి ఉంచిన లారీ చోరీ

నర్సాపూర్: పెట్రోలుబంకు వద్ద పార్కు చేసిన లారీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్-సంగారెడ్డి మార్గంలోని ఓ పెట్రోలు బంకువద్ద లారీని సోమవారం పార్కు చేశారు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ లారీని ఎత్తుకు పోయారు. లారీ యజమాని రమేష్ మంగళవారం చుట్టు పక్కల గ్రామాలలో వెతికినా లారీ జాడ తెలియక పోవడంతో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

ఆటో కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి



ఐడీ కార్డులను అందజేస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఆటో కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. ములుగు మండలం మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసుకున్న బీఆర్‌టీయూ ఆటో యూనియన్ కార్యాలయం వద్ద బుధవారం ముఖ్య అతిథులుగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో రంగాన్ని రక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎక్కడలేని విధంగా ఆటోకార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా, లైఫ్‌ట్యాక్స్ రద్దు లాంటి చర్యలు చేపట్టారన్నారు.

అనంతరం వారు ఆటో డ్రైవర్లకు ఐడీ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి ఏఎంసీ చైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ లింగారెడ్డి, ఆటోయూనియన్ రాష్ట్ర నాయకులు మారయ్య, బాల్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్, బాపురెడ్డి, ఔలయ్య యాదవ్, కమ్మరి సత్తయ్య, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డులో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

సిద్దిపేటజోన్: మున్సిపల్ కమిషనర్ సంపత్ బుధవారం సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 13, 39 వార్డుల్లో తిరిగి పారిశుధ్య పనులు పరిశీలించారు. మురికి కాలువల్లో మట్టి తీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్లు విఠోభ, దీప్తి నాగరాజు, మున్సిపల్ అధికారులు సతీష్, అన్వేష్, మాధవి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ వాహనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్

ప్రభుత్వ భూమిని రక్షించాలి

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని అనంతసాగర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం తహసీల్దార్‌కు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 37లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కార్యక్రమంలో రాచన్న, మాణయ్య, ఈశ్వరయ్య, బస్వరాజ్ పాల్గొన్నారు.

26,27 తేదీల్లో జెడ్పీ స్టాండింగ్ సమావేశాలు

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 26,27 తేదీల్లో నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 26న విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, 27న శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, ఆర్థిక, పనులు తదితర అంశాలపై సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన జరుగుతాయన్నారు. కమిటీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

వ్యక్తికి జరిమానా

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చెట్టు నరికిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. సిద్దిపేటలోని 13 వార్డులో వేప చెట్టును నరికిన బలరాంకు రూ 3000 జరిమానా విధించారు. హరిత సిద్దిపేట లక్ష్యంగా సాగుతున్న పట్టణంలో చెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకుంటామని హరితహారం అధికారి ఐలయ్య తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

చేర్యాల(సిద్దిపేట): వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కర్రోల్ల స్వర్ణకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు భూపాల్, ప్రధాన కార్యదర్శి రంగారావు, జిల్లా అడిషనల్‌కార్యదర్శి ప్రభాకర్, దూల్మిట్ట మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల సాహిత్య సమ్మేళనంలో జిల్లా రచయితలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనంలో సిద్దిపేట బాలసాహిత్య రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో బాలసాహిత్యంలో చేస్తున్న కృషిని వివరించారు. బాలసాహిత్య రచనలు బాలలకు చేరేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాళ్ల రాజేశం, పెందోట వెంకటేశ్వర్లు, డాక్టర్ సుధకార్, యాడవరం చంద్రకాంత్, ఉస్మాన్ పాల్గొన్నారు.

◆ **అడ్మిషన్లకు హెల్ప్‌లైన్ డెస్క్**

జహీరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎండీ అస్లాం ఫారూఖీ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వేర్వేరు చోట్ల ఐదుగురి ఆత్మహత్య

తండ్రి తరచు మద్యం సేవించి తల్లితో గొడవ పడుతున్నాడంటూ ఓ కూతురు, భార్యతో గొడవ పడి భర్త, అప్పుల బాధ భరించలేక రైతు, మద్యానికి బానిసై ఒకరు ఇలా వేర్వేరు కారణాలతో ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

భార్యతో గొడవ పడి...



దుర్గయ్య(ఫైల్)

పాపన్నపేట(మెదక్): కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పోడిచన్ పల్లి గ్రామానికి చెందిన ఎరుకల దుర్గయ్య(60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి సమయంలో ఇంట్లో భార్యభర్త మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో దుర్గయ్య అదే రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బంధువుల వద్దకు వెళ్లడేమో అని కుటుంబీకులు వెతక లేదు. ఈ క్రమంలో బుధవారం పోడిచన్‌పల్లి తండా శివారులో ఓ గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఉన్నాడని, అటుగా వెళ్లిన స్థానికులు మృతుడిని దుర్గయ్యగా గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు..

మెదక్ రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళిఘనాపూర్ మండలంలోని తొగిటలో గ్రామానికి చెందిన కుర్మ బీరయ్య(42) ఉన్న తనకున్న కొద్దిపాటి పొలంతో పాటు ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఏర్పడటంతో మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికారు. గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని బీరయ్య మృతి చెందినట్లు గమనించిన స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో యువతి...



సంధ్యారాణి (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): తండ్రి మద్యానికి బానిసై ఇంట్లో నిత్యం తల్లితో గొడవపడుతుండడంతో మనస్తాపం చెందిన యువతి హెయిర్ డై తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జీడిపల్లికి చెందిన నర్సుగారి సత్యనారాయణ, సుశీల రెండో కూతురు సంధ్యారాణి (18) ఓ పరిశ్రమలో పని చేస్తుంది. మంగళవారం రాత్రి తండ్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడ్డాడు. నిత్యం ఇలాగే జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన సంధ్యారాణి బుధవారం ఉదయం ఇంట్లో హెయిర్ డై తాగి కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు కొంపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి...



బొందయ్య (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజగోపాల్‌పేట ఎస్ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..పాలమాకులగ్రామానికి చెందిన దండబోయిన బొందయ్య(62) నాలుగు సంవత్సరాల క్రితం భార్య మరణించడంతో తాగుడుకు బానిసగా మారాడు. మద్యం మత్తులో బొందయ్య మంగళవారం తన పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుమారుడు నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిర్మాణరంగ కార్మికుడు

నర్సాపూర్: కర్నూలుకు చెందిన రమేష్(40 కొంత కాలంగా నర్సాపూర్‌లో ఉంటూ నిర్మాణ రంగంలో కార్మికునిగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం అతను నివాసముంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ఇంటి యజమాని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూసే సరికి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని రమేష్ ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. కాగా అతని శవం ఉబ్బి ఉంది. మూడు రోజుల క్రితం ఉరి వేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రమేష్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి

కొండాపూర్(సంగారెడ్డి): బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశం కథనం ప్రకారం..మండలపరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన నడూళ్ల వెంకటేశం శుభకార్యం నిమిత్తం తన బంధువుల గ్రామమైన సంగారెడ్డి మండలం ఉత్తెరపల్లికి వెళ్లాడు. శుభకార్యం అనంతరం మంగళవారం తన స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మారేపల్లి శివారులో బైక్‌పై నుంచి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు..

ఆత్మహత్యకు యత్నించిన ఒకరు..గాయపడిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

జోగిపేట(అందోల్): చికిత్స పొందుతున్న ఓ యువకుడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జోగిపేట పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఖలీల్ ఈ నెల 14న తనపై కొందరు దాడి చేశారంటూ 100కు డయల్ చేశారు. దీంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చూడగా అక్కడ ఖలీల్ తప్ప ఇతరులేవరూ లేరు. పోలీసులు దాడి విషయంపై అక్కడున్న వారితో మాట్లాడుతుండగా, ఖలీల్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని పోలీస్‌స్టేషన్‌లోకి పరుగు తీశాడు. అప్రమత్తమైన సీఐ నాగరాజు, ఎస్ఐ సామ్యూనాయక్ బయటకు వచ్చి సిబ్బంది కలిసి మంటలను ఆర్పారు. అనంతరం జోగి పేట ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



ఖలీల్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గాయపడి...

కల్హేర్(నారాయణఖేడ్): తీవ్రంగా గాయపడిన ఎలక్ట్రీషియన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిర్గాపూర్ ఎస్ఐ నారాయణ తెలిపారు. సిర్గాపూర్ మండలం ఖాజపూర్‌కు చెందిన ఆరె రాజు(30) ఈ నెల 21న అంతర్‌గాంలో ఎలక్ట్రీషియన్ పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పోచాపూర్ చౌరస్తా వద్ద జాదవ్‌నాగేష్ పల్సర్ బైక్‌పై అతివేగంగా ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో రాజుకు తీవ్రగాయాలలయ్యాయి. గాంధి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజు బుధవారం మరణించాడు. మృతుడి తండ్రి విఠల్ ఫిర్యాదు కేసు నమోదు చేశారు.

బస్సు బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



బస్సుకింద పడిన బైక్



గాయాలతో క్షతగాత్రులు

సిద్దిపేటరూరల్: ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఇర్కోడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డికి చెందిన చెన్నయ్యా బాలమల్లు పనిమిత్తం ఓ మహిళను బైక్‌పై ఎక్కించుకొని మిరుదొడ్డి నుంచి సిద్దిపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఇర్కోడ్ వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బాలమల్లు మహిళతో సహా రోడ్డుపై పడిపోయారు. బాలమల్లుకు తలకు, ఎడమ చేతికి, కాలుకు గాయాలయ్యాయి. మహిళకు రెండు చేతులకు గాయాలయ్యాయి. దీంతో వారిని 108లో సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలమల్లును సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. సంగారెడ్డి జిల్లాలో భార్యతో గొడవ భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

ఎవరికీ చెప్పకుండా...

అమీన్‌పూర్ ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం... రాఘవేంద్ర కాలనీకి చెందిన లక్ష్మి కూతురు భవాని(19) రెండు నెలల క్రితం చేవెళ్లకు చెందిన ఈశ్వర్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ నెల 17వ తేదీన భవానికి జ్వరం రావడంతో అల్లుడు అత్తకు ఫోన్ చేసి విషయం చెప్పగా, కుటుంబ సభ్యులు చేవెళ్ల వెళ్లి భవాని తీసుకొచ్చి ఆస్పత్రిలో చూపించారు. అప్పటి నుంచి పుట్టింటిలోనే ఉంటుండగా, ఈ నెల 22 వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా భవాని వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తల్లి లక్ష్మి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీకి వెళ్లిన మహిళ

అమీన్‌పూర్ ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని గండిగూడేనికి చెందిన నాగ సబిత(34) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. పదేళ్ల కిత్రం భర్త వదిలివెళ్లిపోయాడు. ఈ నెల 22వ తేదీన డ్యూటీకి వెళ్లిన సబిత తిరిగి రాలేదు. తన సోదరి అదృశ్యమైందని మహేష్‌కుమార్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి..

సంగారెడ్డి టౌన్: రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం..నారాయణఖేడ్ మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన కృష్ణ (32) పదేళ్ల క్రితం సంగారెడ్డి మండలం కులబ్‌గూర్‌కు ఇల్లరికం వచ్చాడు. కృష్ణ మద్యానికి బానిసై భార్య సంగీతతో తరచు గొడవపడేవాడు. ఈ నెల19న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం వెతుకుతుండగా 22న సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద కనిపించడంతో కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్లగా మళ్లీ భార్యతో గొడవపడి అదే రోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

గన్నీ సంచులు ఇవ్వాలని రైతుల ఆందోళన



రోడ్డుపై బారులు తీరిన రైతులు

పోలీసుల జోక్యంతో పంపిణీ

సిద్దిపేటజోన్: గన్నీ సంచులు ఇవ్వాలని రైతులు ఆందోళన చేసిన సంఘటన బుధవారం పత్తి మార్కెట్ యార్డులో చోటుచేసుకుంది. రైతుల కథనం ప్రకారం..కొన్ని రోజులుగా సిద్దిపేట యార్డుకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తోంది. వాటికి మద్దతు ధర అందించే క్రమంలో తేమ శాతం తగ్గించేందుకు అధికారుల సలహా మేరకు యార్డులో ఆరబెట్టారు. వారం రోజులపాటు ధాన్యం యార్డులో ఉందని, గన్నీ సంచులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు యార్డు ముందు రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారికి బీజేపీ నాయకులు వేణుగోపాల్ మద్దతు పలికారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రైతులకు నచ్చజెప్పి మార్కెట్ యార్డు అధికారులతో మాట్లాడారు. దగ్గరుండి గన్నీ సంచులు పంపిణీ చేయించారు. దీంతో అక్కడ గొడవ సద్దుమణిగింది. ఈ విషయంలో మార్కెట్ అధికారులు స్పందిస్తూ రెండు రోజుల క్రితం 15వేల గన్నీ సంచులు పంపిణీ చేసినట్టు చెప్పారు. లారీల ఎగుమతి సమస్య వల్ల మరోసారి గన్నీ సంచులు రైతులకు ఇవ్వలేదన్నారు.



పోలీసుల సమక్షంలో గన్నీ సంచుల పంపిణీ